RNI No: APTEL/2018/76747

# నవతరం

DYNAMIC EDITION తెలుగు దినపత్రిక

WANTED REPORTERS IN TELANGANA
NAVATARAM TELUGU DAILY

| హైదరాబాద్ | శుక్రవారం | సంపుటి: 9 | సంచిక: 248 | పేజీలు: 04 | వెల: 5 /- | 25 సెప్టెంబర్ 2026 |

# ఈ 'దొంగ'చాటు నిర్మాణాన్ని వదిలేసినట్టేనా..?

**కుత్బుల్లాపూర్, నవతరం:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, కుత్బుల్లాపూర్ జోన్ గాజులరామారం సర్కిల్ - 57 లో పుట్టగొడుగుల్లా అక్రమనిర్మాణాలు పుట్టుకొస్తున్నాయి. మున్సిపల్ చట్టాలకు వ్యతిరేకంగా భవన నిర్మాణాలు రాష్ట్ర ఖజానాకు భారీగా గండి కొడుతున్నారు కొందరు అక్రమ నిర్మాణదారులు. గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గానీ, స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు గానీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా 'కండ్లుండి చూడలేని కబోదుల్లా' కనీసం అటువైపు కన్నెత్తి చూడటమే మర్చిపోయారు. గత బంగారు తెలంగాణలో అంతే.. ప్రస్తుత ప్రజాపాలనలోనూ అంతే అన్నట్టుంది వీరి వ్యవహారం. ఓ వైపు రేవంత్ ప్రభుత్వం అనుమతుల్లేని అక్రమ నిర్మాణాలు చేపట్టేవారు ఎవరైనా ఉక్కుపాదంతో అణచివేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నా.. స్థానిక సీఎంసీ కమిషనర్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు తూచాతప్పకుండా ఆచరణలో పెట్టాలని సూచిస్తున్నా గాజులరామారం టౌన్ ప్లానింగ్ అధికారులకు చెవియ పెట్టడం లేదు. ఇక్కడ వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు వంతపాడటం తప్ప, పూర్తి నివారణ చర్యలు తీసుకోవడంలో ఫెయిల్ అవుతున్నారనే చెప్పాలి. ఆన్లైన్ ద్వారా (MY CURE), ప్రజావాణి ద్వారా ఫిర్యాదులు అందినప్పటికీ తూతూ మంత్రంగా.. పాక్షిక కూల్చివేతలు చేస్తూ.. మున్సిపల్ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయడమే తమ డిక్షనరీ లో లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అందుకు వీరు అనుసరించే 'దో నంబర్' వసూళ్ల పాలసీలేనంటూ పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు స్థానిక ప్రజలు. ప్రజావాణి, మై క్యూర్ ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తూ.. కేవలం నోటీసులకే పరిమితమవుతూ.. అందినకాడికి దండుకుంటున్నారు.

## పర్మిషన్ నిల్లీ.. నిర్మాణాలు ఫుల్..

గాజులరామారం సర్కిల్ - 57 లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమనిర్మాణాలకు వెన్నంటి ప్రోత్సాహిస్తున్నారు ఇక్కడి టౌన్ ప్లానింగ్ అధికారులు. ఎలాంటి అనుమతులు మున్సిపల్ అధికారుల నుండి పొందకుండా నాలుగు, అయిదు అంతస్తుల భవన నిర్మాణాలు, భారీ కమర్షియల్ షెడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తున్న నిర్మాణదారులకు పరోక్ష మద్దతు తెలుపుతున్నారు కొందరు 'అవినీతి టౌన్ ప్లానింగ్' అధికారులు. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాల్సిన సంబంధిత అధికారులు.. 'దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టువకాలి' అన్న చందంగా ప్రతిరోజూ ఒక టార్గెట్ పెట్టుకుని.. రోజుకింత వసూలు అంటూ కలెసక్షన్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కోకొల్లలు. స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు పలుమార్లు ప్రజావాణి ద్వారా, ఆన్లైన్ ద్వారా ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ.. పూర్తి స్థాయిలో అక్రమ నిర్మాణాలు నివారించాల్సింది పోయి, తమకేమీ తెలియదన్నట్టు వ్యవహరిస్తున్నారు. తద్వారా, గాజులరామారం టౌన్ ప్లానింగ్ అధికారుల ప్రక్షాళన చేయాలంటూ స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

## కమిషనర్ ఆదేశాలు బేకాతర్..

సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డా. సృజన గుమ్మల, ఐఏఎస్ ఎప్పటికప్పుడు అక్రమ నిర్మాణాల నివారణ, చర్యలకు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నా.. దున్నపోతుమీద వాన పడ్డట్టు కుత్బుల్లాపూర్ జోన్, గాజులరామారం టౌన్ ప్లానింగ్ అధికారులకు మాత్రం చీమ కుట్టినట్టు కూడా లేదు.

గాజులరామారం సర్కిల్ పరిధిలోని మహదేవపురం, కైలాష్ హిల్స్, శిరిడీ హిల్స్, దేవేందర్ నగర్, రావి నారాయణ రెడ్డి నగర్, కైసర్ నగర్, బాలాజీ లే - అవుట్, బందా నవాజ్ బస్తీ లలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను నియంత్రించాల్సింది పోయి.. తూ.. తూ.. తుమ్మకాయ మంత్రం 'నేను కూల్చినట్టు చేస్తా.. నువ్వు ఏడ్చినట్టు చేయు' అంటూ జీరో అనుమతులతో ఏకంగా నాలుగు అంతస్తుల భవన నిర్మాణాలు చేస్తుంటే.. కేవలం పైన ఒక అంతస్థులో చిన్నపాటి శ్లాబ్ భాగాన్ని తొలగించి.. ఫోటో షూట్ చేసుకుని సీఎంసీ కమిషనర్ ను సైతం బోల్తా కొట్టిస్తున్నారంటే గాజులరామారం సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి భాగవతాన్ని ఇట్టే అర్థం చేసుకోవచ్చు. దేవేందర్ నగర్ బందా నవాజ్ బస్తీలో ఓ యూపీవాలా జీరో అనుమతులతో 60 గజాల్లో నిర్మిస్తున్న నాలుగు అంతస్తుల భవన నిర్మాణంపై పలు వార్తా కథనాలు ప్రచురితమైనా.. ప్రజావాణిలో ఫిర్యాదులు వచ్చినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం వెనుక 'లంచాల భాగోతం' రాజ్యామెళుతుందని స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ.. కమిషనర్ చర్యలకు డిమాండ్ చేస్తున్నారు.




## అక్రమనిర్మాణానికి అడ్డుకట్ట పడేనా...?

- జీరో పర్మిషన్ తో భవన నిర్మాణం
- ప్రభుత్వ భూమిలో అనుమతులతో పనేంటంటున్న నిర్మాణదారుడు
- సర్కిల్ - 57 లో రెచ్చిపోతున్న భవననిర్మాణదారుడు
- రోడ్డును సైతం ఆక్రమించిన నిర్మాణదారుడు
- 60 గజాలు కొనుక్కుని 75 గజల్లో భవన నిర్మాణం
- బంద నవాజ్ బస్తీలో అనుమతులతో పని లేదా...?
- దేవేందర్ నగర్ వైపు కన్నెత్తి చూడని టౌన్ప్లానింగ్ అధికారులు
- అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలంటూ ఫిర్యాదులు






కుత్బుల్లాపూర్, నవతరం: ఎలాంటి అనుమతులు లేకుండా మూడు ఫీట్లు ముందుకు జరిగి రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడో ప్రబుద్ధుడు. ఇది గమనించిన బస్తీవాసులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా రెచ్చిపోతూ తననెవరేం చేయలేరు అంటూ ప్రగల్భాలు పలుకుతూ... జీరో నిర్మాణం కొనసాగిస్తున్నాడు సదరు అక్రమ నిర్మాణదారుడు. ఇదంతా కూడా బల్దియా సర్కిల్ 57లోని దేవేందర్ నగర్ బంద నవాజ్ బస్తిలోని ఓ బరితెగించిన నిర్మాణదారుడి కథ. జీరో అనుమతులతో ప్రభుత్వ భూమిలో బహుళ అంతస్థుల భవన నిర్మాణానికి తెరలేపిన సదరు అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుని, తగిన చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇంటి నిర్మాణం కొరకు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా బురిడీ కొట్టిస్తూ... అటు మున్సిపల్ అధికారులను, ఇటు బస్తేవాసులను బురిడీ కొట్టిస్తూ... నేను లీగల్ అంటున్న సదరు అక్రమ నిర్మాణదారుడి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# గణేశ్ బందోబస్తులో ఎస్సై మృతి

- గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో ఎస్సై వెంకన్న మృతి
- హైదరాబాద్‌లో గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఘటన
- ప్రమాదం తర్వాత స్వగ్రామానికి వెళ్లగా ఆరోగ్యం క్షీణించి కన్నుమూత
- కుటుంబానికి అండగా ఉంటామని పోలీస్ కమిషనర్ సజ్జనార్ హామీ
- పరారీలో ఉన్న నిందితుడి కోసం సైఫాబాద్ పోలీసుల గాలింపు

**హైదరాబాద్, నవతరం:** భాగ్యనగర గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన ఓ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) చికిత్స పొందుతూ మృతిచెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టూటౌన్ ఠాణాలో ఎస్సైగా పనిచేస్తున్న కె. వెంకన్న (57) ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. వరంగల్ జిల్లాకు చెందిన ఆయన, గణేశ్ నిమజ్జన బందోబస్తు కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వచ్చారు. వివరాల్లోకి వెళితే, ఎన్టీఆర్ గార్డెన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద ఎస్సై వెంకన్నకు విధులు కేటాయించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2 గంటల సమయంలో, సచివాలయం వైపు నుంచి అంబేద్కర్ విగ్రహం వైపు వేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు వెంకన్నను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఎస్సై రోడ్డుపై పడిపోగా తల, కుడి మోకాలు, కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తి వాహనంతో సహా అక్కడి నుంచి పరారయ్యాడు. ప్రమాదం అనంతరం, వెంకన్నను లక్డీకాపూల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. కాస్త కోలుకున్న తర్వాత ఆయన సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఘటనపై ఫిర్యాదు చేసి, అనంతరం తన స్వగ్రామమైన కిష్టాపురానికి బయలుదేరారు. అయితే, గ్రామానికి చేరుకున్నాక మధ్యాహ్నం తర్వాత ఆయన ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా, తలలో తీవ్ర రక్తస్రావం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకన్న కన్నుమూశారు. ఈ ఘటనపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

**ఎస్సై మృతిపై సీపీ సజ్జనార్ తీవ్ర విచారం**

ఎస్సై వెంకన్న మృతి పట్ల హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. "గణేశ్ నిమజ్జన బందోబస్తులో భాగంగా విధి నిర్వహణలో ఉన్న వెంకన్నగారు గుర్తుతెలియని వాహనం ఢీకొని మరణించడం అత్యంత బాధాకరం, దురదృష్టకరం. ప్రజల భద్రత కోసం పనిచేస్తూ ఆయన ప్రాణాలు కోల్పోవడం తెలంగాణ పోలీసు శాఖకు తీరని లోటు" అని అన్నారు. ఈ విషాద సమయంలో వెంకన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కమిషనర్, ఆ కుటుంబానికి శాఖాపరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితుడిని త్వరలోనే పట్టుకొని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.



# దానం నాగేందర్ అనర్హతపై కౌశిక్ రెడ్డి హర్షం

**హైదరాబాద్, నవతరం:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై అనర్హత వేటును సుప్రీంకోర్టు సమర్థించడాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్వాగతించారు. పార్టీ అధినేత కేసీఆర్ మార్గదర్శకత్వంలో న్యాయపోరాటం చేసి కావాల్సిన ఫలితం సాధించామని ఆయన అన్నారు. పార్టీ మారిన ప్రజాప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్న తమ వాదనకు ఈ తీర్పు బలం చేకూర్చిందని స్పష్టం చేశారు. ఇదే సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల తీరుపై కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. రెండు పార్టీలు అంతర్గతంగా కలిసి పనిచేస్తున్నాయని, పెద్ద ఎత్తున కుమ్మక్కు రాజకీయం సాగుతోందని ఆరోపించారు. ఒకరి స్వార్థం కోసం మరొకరు సహకరిస్తూ నాటకాలు ఆడుతున్నారని, ఇది సిగ్గుమాలిన చర్య అని అభివర్ణించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కోర్టులు వేగంగా తీర్పులు ఇస్తున్నాయని కొందరు ఎద్దేవా చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. న్యాయస్థానాల వేగాన్ని, విచారణ తీరును తక్కువ చేసి మాట్లాడటం అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. చట్టం తన పని తాను చేస్తుందని, న్యాయవ్యవస్థ ఇచ్చిన తీర్పులను గౌరవించాలని సూచించారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఉన్నా కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తుందని చెప్పారు.



# బొగ్గు కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం

**హైదరాబాద్, నవతరం:** నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో ఎదురవుతున్న బొగ్గు కొరతకు, విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని మాజీ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ప్రతినిధుల బృందంతో కలిసి ఆయన ఈరోజు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను స్వయంగా పరిశీలించారు. అనంతరం ప్లాంట్ అధికారులతో సమావేశమై విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి గల సాంకేతిక, పరిపాలనాపరమైన కారణాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. సింగరేణి సంస్థ నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ప్లాంట్లకు సక్రమంగా సరఫరా చేయకుండా దాదాపు 40 లక్షల టన్నుల బొగ్గును పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు.



తెలంగాణలోని పవర్ ప్లాంట్లకు బొగ్గు కొరత సృష్టించి, ప్రజలను ముఖ్యంగా రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఏ విధంగానైతే 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను అందించిందో, అదే రీతిలో పవర్ ప్లాంట్లకు పూర్తిస్థాయిలో బొగ్గు సరఫరా చేసి నిరంతర విద్యుత్ అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# తెలుగు రాష్ట్రాల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా మధుకర్

- బీజేపీలో భారీ సంస్థాగత మార్పులు
- ఏపీ, తెలంగాణ సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా మధుకర్ నియామకం
- తెలంగాణ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా దశరథ్ బాధ్యతలు
- ఆంధ్రప్రదేశ్‌తో సహా 5 రాష్ట్రాలకు జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా శివప్రకాశ్
- దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు కొత్త సంస్థాగత ప్రధాన కార్యదర్శుల నియామకం

**హైదరాబాద్, నవతరం:** బీజేపీ తమ సంస్థాగత నిర్మాణంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు కొత్త సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, సంయుక్త ప్రధాన కార్యదర్శులను నియమించింది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కూడా కొత్త బాధ్యులను కేటాయించింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా మధుకర్‌ను నియమించారు. ఆయన హైదరాబాద్ కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్ర సంయుక్త సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా వరంగల్ కేంద్రంగా పనిచేసేందుకు దశరథ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మార్పుల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంపై అధిష్టానం దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. జాతీయ స్థాయిలోనూ పలు కీలక నియామకాలు జరిగాయి. జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా శివప్రకాశ్‌ను నియమించగా, ఆయనకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గోవా రాష్ట్రాల బాధ్యతలు అప్పగించారు. ఆయన ముంబై కేంద్రంగా పనిచేస్తారు. మరో జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా సౌదాన్ సింగ్‌ను నియమించి, బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ బాధ్యతలను కేటాయించారు.

**ఇక ఇతర రాష్ట్రాల విషయానికొస్తే..**

మహారాష్ట్రకు అజయ్ జమ్వాల్, బీహార్‌కు భిఖూభాయ్ దల్సానియా, ఝార్ఖండ్‌కు పవన్ సాయి, గుజరాత్‌కు రత్నాకర్, ఉత్తరాఖండ్‌కు ఫణీంద్రనాథ్ శర్మ, పంజాబ్-చండీగఢ్‌కు మంత్రి శ్రీనివాసులు, ఉత్తరప్రదేశ్‌కు ధరమ్‌పాల్, పశ్చిమ బెంగాల్‌కు అమితాబ్ చక్రవర్తిని రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. అసోం, త్రిపుర రాష్ట్రాలకు రవీంద్ర రాజు, హిమాచల్ ప్రదేశ్‌కు సిద్ధార్థన్, ఢిల్లీ-హర్యానాకు పవన్ రాణా, ఛత్తీస్‌గఢ్‌కు కరమ్‌వీర్, మధ్యప్రదేశ్‌కు చంద్రశేఖర్, ఒడిశాకు మానస్ మహంతిని నియమిస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలకు సంబంధించిన సర్క్యులర్‌ను పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ అన్ని రాష్ట్ర శాఖలకు పంపించారు.



# పరువునష్టం పిటిషన్లు స్వీకరించిన కోర్టు

- తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేశారంటూ హరీశ్ మండిపాటు
- ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి నిందలు వేస్తున్నారని విమర్శ
- ఇప్పటి వరకు డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని వ్యాఖ్య

**హైదరాబాద్, నవతరం:** తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై ఆధారాలతో క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు విచారణకు స్వీకరించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు తెలిపారు. ఈ విషయంలో సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు కోర్టు అనుమతించిందని వెల్లడించారు. నాంపల్లి కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తమపై ఈ తరహా నీచమైన నిందలు వేస్తున్నారని హరీశ్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లైనా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని అన్నారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులను కూడా స్పీకర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటివని అభివర్ణించారు. లోక్‌సభలో రాజ్యాంగ సంరక్షకుడిగా మాట్లాడే రాహుల్ గాంధీ, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను కాపాడేందుకు స్పీకర్ ప్రయత్నించారని, అయితే పార్టీ మారిన ఎమ్మెల్యేలందరికీ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు తప్పదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఫిరాయింపు నేతలు రాజీనామాలు చేసి ప్రజా తీర్పును కోరాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.



# నిఖిత మృతి కేసులో బిగ్ ట్విస్ట్

**హైదరాబాద్, నవతరం:** హైదరాబాద్‌లోని మాదాపూర్ ఓయో హోటల్‌లో విశాఖకు చెందిన నిఖిత అనుమానాస్పద మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన అనుమానితుడిగా ఉన్న శ్రీనివాస రవితేజ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని తన స్వగ్రామం ఏడుమెట్ల మర్రిపాలెంలో ఉన్న ఇంట్లో రవితేజ ఫ్లోర్ క్లీనింగ్ లిక్విడ్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత పరిస్థితి విషమించడంతో విశాఖపట్నంలోని కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో రవితేజకు వైద్యులు చికిత్స అందిస్తుండగా అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై పరవాడ పోలీసులు మాదాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. విశాఖపట్నానికి చెందిన నిఖిత, రవితేజలు సెప్టెంబర్ 21న మాదాపూర్ సిద్ధిఖీనగర్‌లోని ఓయో హోటల్‌లో గది తీసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున నిఖిత అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కొండాపూర్ అపోలో ఆసుపత్రికి తరలించగా, ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అయితే నిఖిత ముఖం, తలపై తీవ్ర గాయాలు ఉండటం, హోటల్ గదిలోని గోడలు, బెడ్‌షీట్‌పై రక్తపు మరకలు, మద్యం సీసాలను క్లూస్ టీమ్ గుర్తించడంతో ఇది హత్యేనని అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆసుపత్రిలో నిఖిత మరణించిందని తెలిసిన వెంటనే రవితేజ అక్కడి నుంచి పరారై ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. గాలింపు చర్యలు చేపడుతున్న సమయంలోనే అతడు స్వగ్రామంలో ఆత్మహత్యాయత్నం చేశాడు. ఫోరెన్సిక్ నివేదికలు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా మాదాపూర్ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.




# రిజిస్ట్రేషన్లకు తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, నవతరం:** రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరిన భూముల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేలాది మంది ఆస్తి యజమానులకు భారీ ఊరట కల్పించింది. 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ... జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి అనుమతులు పొందిన లేఅవుట్లు, భవనాలకు రిజిస్ట్రేషన్లు చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేయగా, అవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. సాంకేతిక కారణాలు లేదా రెవెన్యూ వర్గీకరణల వల్ల 22ఏ జాబితాలో చేరినప్పటికీ, చట్టబద్ధమైన ప్రణాళికా సంస్థల నుంచి అనుమతులు ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయంతో ఇప్పటివరకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన ఆస్తుల యజమానులు ఇకపై నేరుగా తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా, ఇతరులకు బదిలీ చేసేందుకు కూడా మార్గం సుగమమైంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని అనేక హౌసింగ్ కాలనీల నివాసితులకు ఈ నిర్ణయం పెద్ద ఉపశమనం కలిగించనుంది. చాలాకాలంగా స్తంభించిపోయిన స్థిరాస్తి లావాదేవీలు తిరిగి ఊపందుకుంటాయని భావిస్తున్నారు. ఈ ప్రయోజనం పొందాలనుకునే యజమానులు సంబంధిత పత్రాలతో అధికారులకు దరఖాస్తు చేసుకుని, తమ ఆస్తులపై ఉన్న రిజిస్ట్రేషన్ ఆంక్షలను తొలగించుకోవచ్చని రెవెన్యూ శాఖ సూచించింది. మరోవైపు, 22ఏ భూముల అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చ అనంతరం ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో రాజీవ్‌గాంధీ హనుమంతు, సందీప్‌కుమార్ ఝా సభ్యులుగా ఉంటారు. ఆయా జిల్లాల కలెక్టర్లు కూడా ఈ కమిటీలో భాగస్వాములుగా ఉంటారు. 22ఏ భూముల విషయంలో జరిగిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఈ కమిటీ విచారణ చేపట్టనుంది. ఈ కమిటీ పరిధి కేవలం 22ఏ అంశానికే పరిమితం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది.




# ఎన్నికలకు సిద్ధం అవుతా..

**హైదరాబాద్, నవతరం:** ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టు తీర్పుపై స్పందించారు. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సంపూర్ణంగా గౌరవిస్తున్నానని తెలిపారు. చట్టపరమైన ప్రక్రియ పట్ల ఉన్న గౌరవంతోనే తాను న్యాయపోరాటం చేశానని చెప్పారు. ఇక తన భవిష్యత్తును ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటానని స్పష్టం చేశారు. "కోర్టు తీర్పు ఇలా వస్తుందని ముందే ఊహించాను. అయితే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం కొంత ఊరట లభిస్తుందని భావించాను. అందుకే చట్టపరంగా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాను" అని దానం నాగేందర్ పేర్కొన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైన నేపథ్యంలో తాను సిద్ధంగా ఉన్నట్లు దానం తెలిపారు. ఖైరతాబాద్ ప్రజలతో తనకు దశాబ్దాలుగా అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ వారికి అండగా ఉన్నానని చెప్పారు. రాబోయే ఉప ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి వారి ఆశీర్వాదం కోరతానన్నారు. ప్రజల మద్దతు తనకే ఉంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. దీనిపై దాఖలైన అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఆయనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించి ఖైరతాబాద్ సీటు ఖాళీ అయినట్లు పేర్కొంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. నేడు అత్యున్నత న్యాయస్థానం ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సమర్థించింది. దీంతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికకు మార్గం ఏర్పడింది.



# సుప్రీం తీర్పు పార్టీలన్నింటికీ ఓ గుణపాఠం

- **దానం వ్యవహారంలో సుప్రీం తీర్పును స్వాగతించిన సీపీఐ నారాయణ**
- **ఫిరాయింపులపై అన్ని పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచన**
- **బీజేపీ, బీజేపీ సైతం ఫిరాయింపులను ప్రోత్సాహించాలని విమర్శలు**
- **ఫిరాయింపుల వల్ల ప్రజాస్వామ్యానికే నష్టమని వ్యాఖ్య**
- **ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని కఠినతరం చేయాలని సూచన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నవతరం):** దానం నాగేందర్ అనర్హత కేసులో సుప్రీంకోర్టు తీర్పు పార్టీ ఫిరాయింపులపై కీలక సందేశం ఇచ్చిందని సీపీఐ సీనియర్ నేత కె.నారాయణ అన్నారు. దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసిన విషయం తెలిసిందే. తెలంగాణ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునే అవసరం లేదని స్పష్టం చేసింది. 2023లో బీఆర్ఎస్ టికెట్‌పై ఖైరతాబాద్ నుంచి గెలిచిన నాగేందర్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయనపై అనర్హత వేటు పడింది. ఈ తీర్పును ఒక్క దానం నాగేందర్ వ్యవహారానికే పరిమితం చేయకూడదని నారాయణ అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న తీరుపై ఆత్మపరిశీలన జరగాలని సూచించారు. తీర్పు వెలువడిన వెంటనే బీజేపీ సంబరాలు చేసుకోవడాన్ని ఆయన తప్పుపట్టారు. దేశంలో, వివిధ రాష్ట్రాల్లో పార్టీ మార్పులను ప్రోత్సహించిన చరిత్ర బీజేపీకి కూడా ఉందని విమర్శించారు. ఇప్పుడు ఫిరాయింపులపై నీతులు చెప్పడం సరికాదని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యేల చేరికలపై బీఆర్ఎస్ విమర్శలు చేస్తోందని నారాయణ పేర్కొన్నారు. అయితే గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్న విషయాన్ని కూడా గుర్తు చేశారు. ప్రధాన రాజకీయ పార్టీలు గతంలో చేసిన ఫిరాయింపులపై పరస్పరం ఆరోపణలు చేసుకోవడం కంటే తమ వైఖరిని సమీక్షించుకోవాలని సూచించారు. రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల వల్ల చివరికి ప్రజాస్వామ్య వ్యవస్థకే నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దానం నాగేందర్ కేసులో వచ్చిన తీర్పు భవిష్యత్ ఫిరాయింపు కేసులకు మార్గదర్శకంగా నిలవాలని నారాయణ ఆకాంక్షించారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలో చేరే ఎమ్మెల్యేలపై వెంటనే అనర్హత వేటు పడేలా ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని మరింత కఠినతరం చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి మార్పులు వస్తేనే పార్టీ మారే రాజకీయాలకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు.



# హైదరాబాద్‌లో కోటి పలికిన గణేశుడి లడ్డు

- **రాజేంద్రనగర్ కీర్తి రిచ్‌మండ్‌లో కోటి దాటిన గణేశ్ లడ్డూ వేలం**
- **శక్తిమాన్ బృందం రూ.1.01 కోట్లకు లడ్డూ కైవసం**
- **గతేడాది ఇదే కమ్యూనిటీలో లడ్డూ రూ.2.31 కోట్లు పలికిన రికార్డు**
- **రేపు జరగనున్న బాలాపూర్ లడ్డూ వేలంపై ఉత్కంఠ**
- **గతేడాది బాలాపూర్ లడ్డూ ధర రూ.35 లక్షలుగా నమోదు**

**హైదరాబాద్, నవతరం:** హైదరాబాద్‌లో గణేశ్ లడ్డూ వేలం పాటలో మరోసారి భారీ ధర నమోదైంది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కీర్తి రిచ్‌మండ్ గేటెడ్ కమ్యూనిటీలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన వేలంలో గణపతి లడ్డూ ఏకంగా రూ.1.01 కోట్లు పలికింది. ప్రతి ఏటా పోటాపోటీగా జరిగే ఈ వేలంలో ఈసారి శక్తిమాన్ బృంద సభ్యులు లడ్డూను కైవసం చేసుకున్నారు. కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో లడ్డూ వేలానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. కమ్యూనిటీ వాసులు నాలుగు గ్రూపులుగా విడిపోయి ప్రతి ఏటా పోటీ పడుతుంటారు. ఈసారి కూడా అర్ధరాత్రి వరకు ఉత్కంఠభరితంగా సాగిన వేలంలో శక్తిమాన్ బృందం విజయం సాధించింది. గతేడాది (2025) ఇదే కమ్యూనిటీలో లడ్డూ రికార్డు స్థాయిలో రూ.2.31 కోట్లు పలకడం గమనార్హం. ఆ రికార్డుతో పోలిస్తే ఈసారి ధర తక్కువే అయినప్పటికీ, కోటి రూపాయల మార్కును దాటడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. స్వామివారి లడ్డూను దక్కించుకోవడం వల్ల శుభం, ఐశ్వర్యం కలుగుతాయనే బలమైన విశ్వాసంతో భక్తులు ఎంతటి ధరకైనా వెనుకాడటం లేదు. హైదరాబాద్‌లోని గేటెడ్ కమ్యూనిటీలలో లడ్డూ వేలం పాటలు కోట్లలో జరుగుతుండగా, ఇప్పుడు అందరి దృష్టి తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే బాలాపూర్ లడ్డూ వేలంపై కేంద్రీకృతమైంది. రేపు చారిత్రక బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం జరగనుంది. 1994లో కేవలం రూ.450తో మొదలైన ఈ వేలం ప్రస్థానం, మూడు దశాబ్దాల్లో లక్షల రూపాయలకు చేరింది. గతేడాది బాలాపూర్ లడ్డూను కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ్ గౌడ్ రూ.35 లక్షలకు దక్కించుకోగా, 2024లో రూ.30.01 లక్షలు పలికింది. ఈసారి పూరీ జగన్నాథ ఆలయ నమూనాలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువైన బాలాపూర్ గణపయ్య లడ్డూ (21 కిలోలు) కొత్త రికార్డు సృష్టిస్తుందా? అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. టెడ్ కమ్యూనిటీలలో కోట్లలో ధర పలుకుతున్న నేపథ్యంలో బాలాపూర్ లడ్డూ ఆ రికార్డులను అందుకుంటుందా? లేదా? అన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. బాలాపూర్ వేలం అనంతరం జరిగే గణేశుడి శోభాయాత్రతోనే నగర నిమజ్జనం ప్రారంభం కావడం ఆనవాయితీ.





# బాలాపూర్ లడ్డూ వేలం.. సరికొత్త రికార్డులు

**హైదరాబాద్, నవతరం:** భాగ్యనగరంలో వినాయక నవరాత్రుల వేడుకలు ఎంత ఘనంగా జరుగుతాయో.. ఆ బొజ్జ గణపయ్య లడ్డూ వేలం పాటలు కూడా అంతే హోరాహోరీగా సాగుతాయి! ఆ విఘ్నేశ్వరుడి పవిత్ర ప్రసాదాన్ని దక్కించుకోవడానికి భక్తులు లక్షలు, కోట్లు వెచ్చించేందుకు కూడా వెనకాడటం లేదు. ఈ ఏడాది హైదరాబాద్‌లోని పలు గేటెడ్ కమ్యూనిటీల్లో లడ్డూల వేలం పాత రికార్డులను తిరగరాసింది. అసలు ఏ కమ్యూనిటీలో లడ్డూ ఎంత పలికింది? కోటి రూపాయలు దాటిన ఆ లడ్డూ ఏది? తెలుగు రాష్ట్రాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్న బాలాపూర్ లడ్డూ వేలం విశేషాలేంటి? అలాగే లక్షలాది మంది పాల్గొనే నిమజ్జన శోభాయాత్రకు పోలీసులు చేసిన 3-అంచెల భద్రతా ఏర్పాట్లేంటి? ఈ పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం! హైదరాబాద్‌లోని అపార్ట్‌మెంట్లు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలలో లడ్డూ వేలం పాట అనేది ఒక గొప్ప ఆధ్యాత్మిక వేడుకగా మారిపోయింది. నగరంలోని రాజేంద్రనగర్ పరిధి కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో లడ్డూ వేలం సరికొత్త సంచలనం సృష్టించింది! శక్తిమాన్ బృంద సభ్యులు ఏకంగా కోటి లక్ష రూపాయలకు ఈ లడ్డూను దక్కించుకున్నారు. గత ఏడాది ఇక్కడ లడ్డూ వేలం రెండు కోట్ల 31వేలు పలకడం విశేషం. కొండాపూర్‌లోని మై హోమ్ మంగళలో జరిగిన వేలంలో తీవ్ర పోటీ నడిచింది. పోటాపోటీగా సాగిన వేలంలో సాంబశివరావు, నవీన్ అనే భక్తులు 21లక్షల 11వేలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. ఇటు ప్రగతి నగర్‌లోని రఘుపతి కౌంటీలో జరిగిన లడ్డూ వేలంలో నరేన్ చౌదరి బృందం 13లక్షల 66వేలతో సొంతం చేసుకున్నారు. అటు కొండాపూర్ ఇండిస్ వివా సిటీలో రామ్‌శ్రీ గౌతమ్, వైశాలి దంపతులు 13లక్షల 21వేలతో గణపతి లడ్డూను కైవసం చేసుకున్నారు. కూకట్‌పల్లిలోని దేవస్థాన్ హోమ్స్‌లో జరిగిన లడ్డూ వేలంలో 10లక్షల 5వేలు పలికింది. మరోవైపు బండ్లగూడ జీకేఆర్‌ఎస్ పలాసియో విల్లాస్ నివాసి రమేష్ 4లక్షల 50వేలకు దక్కించుకున్నారు. ఇవే కాకుండా సికింద్రాబాద్ ఆలుగడ్డ బావిలో జై భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో తొలిసారిగా లడ్డూ వేలం నిర్వహించారు. గణనాథుడి లడ్డూ ప్రసాదం దక్కించుకోవటానికి భక్తులు, స్థానికులు పోటీ పడ్డారు. చివరకు స్నేహగణేష్ దంపతులు లక్షా 36వేలకు స్వామివారి ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. నానక్‌రాంగూడలోని గోల్ఫ్ వ్యూలో 2లక్షల 60 వేలు, చందానగర్ అపర్ణ సైబర్ కమ్యూన్‌లో 45వేలకు లడ్డూ వేలాలు సాగాయి. అయితే, ఈ వేలం పాటల ద్వారా వచ్చే లక్షల రూపాయల నిధులను నివాసితులు కేవలం ఉత్సవాలకే పరిమితం చేయడం లేదు. అందులో సగం మొత్తాన్ని సామాజిక సేవలకు, పేదలకు సహాయం చేయడానికి ఉపయోగిస్తున్నారు. మిగిలిన సగం సొమ్మును వచ్చే ఏడాది వినాయక చవితి నిర్వహణకు కేటాయిస్తున్నారు. ఈ విధంగా లడ్డూ వేలం అనేది భక్తితో పాటు కమ్యూనిటీ ప్రజలను ఒకతాటిపైకి తెచ్చే సామాజిక వేడుకగా నిలుస్తోంది. ఇక రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే ప్రసిద్ధ బాలాపూర్ గణేష్ లడ్డూ వేలం సెప్టెంబర్ 25న జరగనుంది. నిమజ్జన శోభాయాత్ర ప్రారంభమయ్యే ముందు ఉదయన్నే ఈ వేలం నిర్వహిస్తారు. ఈసారి బాలాపూర్ మండపాన్ని ఎంతో అద్భుతంగా పూరీ జగన్నాథ ఆలయ నమూనాలో తీర్చిదిద్దారు. ఇక్కడ వేలం వేసే లడ్డూ బరువు సుమారు 21 కిలోలు ఉంటుంది. 1994లో కేవలం 450 రూపాయలతో ప్రారంభమైన బాలాపూర్ లడ్డూ వేలం, గడిచిన 30 ఏళ్లలో లక్షల రూపాయలకు చేరుకుంది. మరి ఈసారి 2026 వేలంలో బాలాపూర్ లడ్డూ కొత్త రికార్డు సృష్టిస్తుందో లేదో చూడాలి! మరోవైపు బాలాపూర్ నుంచి ఖైరతాబాద్ మహాగణపతి వరకు నగరం అంతటా జరిగే వినాయక నిమజ్జన శోభాయాత్రకు హైదరాబాద్ సిటీ పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసింది. 20 వేల మంది బలగాలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేశారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బందితో పాటు RAF, CRPF కంపెనీలను సున్నితమైన ప్రాంతాల్లో మోహరించారు. ప్రధాన రహదారులు, చెరువుల వద్ద ఏర్పాటు చేసిన 10 వేలకు పైగా సీసీ కెమెరాలను బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించారు. శోభాయాత్ర సాగే తీరును ఆకాశ మార్గం నుంచి పర్యవేక్షించేందుకు డ్రోన్లను, భవనాలపై హైరైజ్ కెమెరాలను ఉంచారు. ఇక.. హుస్సేన్ సాగర్ చుట్టూ ఉన్న 100 హైరైజ్ సీసీ కెమెరాల ద్వారా విగ్రహాల లెక్కను కూడా పక్కాగా చెప్తామని అంటున్నారు అధికారులు. ఇక నిమజ్జన సమయాల్లో అధికారులకు అతిపెద్ద సవాల్ ట్రాఫిక్ కంట్రోల్. దీనికోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు అధికారులు. ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్డు పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. ఈ నెల 25న ఉదయం ఆరు గంటల నుంచే ట్రాఫిక్ మళ్లింపుతో పాటు ఆంక్షలు అమల్లోకి వస్తాయి. గణేష్ నిమజ్జన యాత్ర రూట్లలో ఇతర వాహనాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదు. మహిళల భద్రత కోసం 26 షీ టీమ్స్, మఫ్టీ పోలీసులు గస్తీ కాస్తున్నారు. హుస్సేన్ సాగర్ వద్ద ఇండియన్ ఆర్మీ, టూరిజం శాఖకు చెందిన ఈతగాళ్లు, రెస్క్యూ బోట్లను సిద్ధంగా ఉంచారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం శోభాయాత్రలో డీజేలు, బాణసంచాను పూర్తిగా నిషేధించారు. శాంతియుత వాతావరణంలో, గంగా-జమునా తెహజీబ్ సంప్రదాయాన్ని కాపాడుతూ ఉత్సవాలను జరుపుకోవాలని సీపీ విజ్ఞప్తి చేశారు.








# రాహుల్, రేవంత్‌లకు ఇది "సుప్రీం చెంపపెట్టు"

**హైదరాబాద్, నవతరం:** బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద తనపై అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఇది లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిలిన "సుప్రీం చెంపపెట్టు" అని అభివర్ణించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ, అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి దానం నాగేందర్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. "ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించి, స్పీకర్ చాటున దాక్కోవచ్చని రాహుల్, రేవంత్ భావించారు. స్పీకర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకుని ఫిరాయింపులను ప్రోత్సహించే వారి ప్రయత్నాలను ఈ తీర్పు బట్టబయలు చేసింది" అని కేటీఆర్ ఆరోపించారు. త్వరలో ఖైరతాబాద్‌లో జరగనున్న ఉప ఎన్నికల్లో ప్రజలు మూడేళ్ల ద్రోహానికి, హామీల ఉల్లంఘనకు తగిన తీర్పు ఇస్తారని ఆయన వ్యాఖ్యానించారు. "ఒక వికెట్ పడింది.. త్వరలో మరిన్ని పడతాయి" అని హెచ్చరిస్తూ, తన పోస్ట్ చివరలో "మార్క్ మై వర్డ్స్, ఎమ్మెల్యే చోర్ @రాహుల్‌గాంధీ" అని ఘాటుగా విమర్శించారు.

**కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిపై హరీశ్ రావు ఫైర్**

సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ శాసనసభ ఉప నాయకుడు హరీశ్ రావు కూడా స్వాగతించారు. "రాజ్యాంగాన్ని కాపాడతాం" అని చెప్పే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి ఇది చెంపపెట్టు అని అన్నారు. "పదేపదే 'సంవిధాన్ బచావో' అని నినదించే రాహుల్ గాంధీకి ఇప్పుడు అసలైన పరీక్ష ఎదురైంది. ఆయనకు నిజంగా రాజ్యాంగంపై నమ్మకం ఉంటే, కాంగ్రెస్‌లో చేరిన మిగతా ఎమ్మెల్యేలందరితో వెంటనే రాజీనామా చేయించి, తిరిగి ప్రజా తీర్పు కోరాలి" అని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాజ్యాంగ నైతికత గురించి మాట్లాడి, తెలంగాణలో తమ పార్టీ చర్యలపై మౌనంగా ఉండటం సరికాదని హరీశ్ రావు విమర్శించారు. "సంవిధాన్ బచావో అనేది రాజ్యాంగ నిబద్ధతా లేక కేవలం రాజకీయ నినాదమా?" అని ఆయన ప్రశ్నించారు.



# గణేష్ నిమజ్జనం సేవల్లో 'హైడ్రా'

- **పహారాలో 234 మంది హైడ్రా స్విమ్మర్లు**
- **-వీరికి తోడు 51 డీఆర్ఎఫ్ బృందాలు**

**హైదరాబాద్, నవతరం:** భక్తిశ్రద్ధలతో పూజలనంతరం గణనాథుడి నిమజ్జన కార్యక్రమానికి నగర ప్రజలు సిద్ధమౌతున్నారు. ఇప్పటికే కొన్ని విగ్రహాలు నిమజ్జనం పూర్తి చేయగా.. శుక్రవారం ప్రధాన నిమజ్జన ఘట్టం ప్రారంభం కానుంది. భక్తుల ఆధ్యాత్మిక ఉత్సాహానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా హైడ్రా ఏర్పాట్లు చేసింది. కూకట్ పల్లి ఐడీఎల్ చెరువు అభివృద్ధి పనులు పూర్తవ్వనప్పటికీ.. గణేష్ నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా.. ఏకంగా 25 అడుగుల మేర చెరువును తవ్వి నిమజ్జనాలు సాఫీగా సాగేలా ఏర్పాట్లు చేసింది హైడ్రా. ఈ ఏర్పాట్లు ఇలా ఉండగా.. హుస్సేన్‌సాగర్‌తో పాటు నిమజ్జనం పెద్ద సంఖ్యలో జరిగే చెరువులలో హైడ్రా స్విమ్మర్లను రంగంలోకి దించింది. హుస్సేన్‌సాగర్లో మూడు షిఫ్టులలో చెరి 50 మంది చొప్పున మొత్తం 150 మంది స్విమ్మర్లను అందుబాటులోకి తెచ్చింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మరో 84 మంది స్విమ్మర్లను విధుల్లో ఉంచింది. వీరికి అదనంగా 51 డీఆర్ ఎఫ్ బృందాలు నిమగ్నమయ్యాయి. గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా మిగతా శాఖలతో కలిసి హైడ్రా చర్యలు తీసుకుంటోందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు.





Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally (B.Tech, MBA, Journalism (NiMA), Ph.D(Hons) in Mass Communication & Journalism - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India.
https://epaper.navatharam.com